సాక్షి
అనకాపల్లి
బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



అంబరాన్నంటిన సంబరం

బుచ్చెయ్యపేట మండలంలోని బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల సంబరం అంబరాన్నంటింది. 8లో



రైతు బాగుంటేనే అభివృద్ధి

రైతులు బాగుంటేనే అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధిస్తామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 8లో



చందనోత్సవంపై విచారణ

చందనోత్సవం నిర్వహణలో వైఫల్యాలపై విశాఖ జేసీ విచారణ ప్రారంభించారు. 8లో నాలుగు రోజుల్లో నివేదిక సమర్పించనున్నారు.

న్యూస్‌రీల్

నర్సీపట్నంలో జిల్లా ఇరిగేషన్ కార్యాలయం



ఉత్తర్వుల కాపీని చూపుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా ఇరిగేషన్ కార్యాలయాన్ని నర్సీపట్నంలో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి నర్సీపట్నం కేంద్రంగా ఉన్నందున జిల్లా కార్యాలయం నర్సీపట్నంలో ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నర్సీపట్నంలో జిల్లా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు.

రేపు పీఎఫ్ అదాలత్

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు ఈపీఎఫ్ సభ్యత్వం కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విశాఖ ఈపీఎఫ్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ సభ్యత్వం కలిగిన ప్రతి వ్యక్తి తమ సమస్యలను అదాలత్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అదాలత్‌లో వచ్చే ప్రతి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

కలిసికట్టుగా దోమల నిర్మూలన



ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ హేమంత్

అనకాపల్లి టౌన్: అందరూ బాధ్యతగా వ్యవహరిస్తే దోమలను నిర్మూలించడం కష్టం కాదని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పెరగడానికి ప్రధానంగా మురికి కుంటలు, ఇళ్లలో నీటి నిల్వ ఉంచడమే కారణమని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కాలువల్లో మందులు చల్లడం, ఫాగింగ్, వారానికి ఒక రోజు డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి, డీఎంవో కె.వి.దొర, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు, మలేరియాశాఖ, జీవీఎంసీ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆడిట్ ప్రారంభం

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మంగళవారం అమరావతి అకౌంటెంట్ జనరల్ ఆడిట్ బృందం సభ్యులు సందర్శించారు. వీరు వివిధ విభాగాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యాలయంలో 2017 నుంచి ఆడిట్ జరగలేదని, ప్రభుత్వం ఇందుకోసం ఆడిటర్ల బృందంతోపాటు ఇద్దరు ఆడిట్ సిబ్బందిని నియమించిందని చెప్పారు. వారు వారం రోజులు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని తెలిపారు.

వేడుకగా శోభాయాత్ర



శోభయాత్రలో పాల్గొన్న శ్రీవైష్ణవులు

అనకాపల్లి టౌన్: భగవత్ శ్రీ రామానుజాచార్యులు 1006 జయంతిని పురస్కరించుకుని సుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర చాత్తాద శ్రీ వైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ డి.మనోజ్‌కుమార్ పాల్గొని యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామానుజాచార్యులు జయంతిని వచ్చే ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది శ్రీ వైష్ణవ కుటుంబీకులున్నారని, ఆర్థికంగా వెనుకబడిన తమ జాతిని బీసీ 'డి' నుంచి బీసీ 'ఎ'కు మార్పు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. తమను ప్రభుత్వ దేవాలయాల్లో అర్చకులుగా నియమించాలని కోరారు. అనంతరం 50మంది మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, నరసింహమూర్తి, గుంటూరు జనార్దనాచార్యులు, తొండా గీతాంజలి, నారాయణమూర్తి, టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హాయివే..

ఇరు వైపులా పచ్చని మొక్కలు.. సువిశాలమైన ఆరు లైన్ల రహదారులు.. వంద కిలోమీటర్లకు పైగా వేగంతో సర్రున సాగిపోయే సౌలభ్యం.. బండి స్టార్ట్ చేశాక గమ్యం చేరే వరకు యాక్సిలిరేటర్‌పై కాలు తీయాల్సిన పనే ఉండదు.. ఇవీ అనకాపల్లి–ఆనందపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రత్యేకతలు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే నెల రోజుల నుంచి వాహనాలను అనుమతించడం ప్రారంభించారు. మిగిలిన అరకొర పనులను కూడా మే నెలాఖరుకు పూర్తి చేయనున్నారు.



'అనకాపల్లి-ఆనందపురం' జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు

- హరిత అందాలతో 'అనకాపల్లి-ఆనందపురం' జాతీయ రహదారి
- 58.8 కి.మీ. మేర రహదారికి ఇరువైపులా 30 వేలకుపైగా మొక్కలు
- రోడ్డు మధ్యలో మరో 14 వేల మొక్కలు
- సబ్బవరం మినహా అందుబాటులోకి వచ్చిన గ్రీన్ హైవే
- మే నెలాఖరుకు పూర్తి స్థాయిలో వాహనాలకు క్లియరెన్స్
- గంటకు 120 కి.మీ. వేగం వరకు అనుమతులు
- త్వరలో విశాఖ నగరానికి తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

సాక్షి, అనకాపల్లి: పరిపాలనా రాజధాని కాబోతున్న విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు తొలగుతున్నాయి. 'అనకాపల్లి–ఆనందపురం' ఎన్‌హెచ్–16 జాతీయ రహదారిపై వాహనాలు రయ్.. రయ్‌మంటూ సాగిపోతున్నాయి. మార్చి నెలాఖరున ఈ జాతీయ రహదారిని అంకితం చేసిన విషయం తెలిసిందే. పోర్టుకు వెళ్లే వాహనాలకు పినగాడి దగ్గర ఇంటర్ చేంజ్ సెక్షన్ కూడా ఏర్పాటు చేసి... షీలానగర్‌కు అనుసంధానం చేసే విధంగా నిర్మాణపనులకు శ్రీకారం చుడుతున్నారు. సబ్బవరం వద్ద మినహా అనకాపల్లి- ఆనందపురం హైవేపై వాహనాలను అనుమతిస్తున్నారు. మే నెలాఖరు నాటికి ఈ రోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగంగా అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు 58.8 కిలోమీటర్ల పొడవునా రూ.2013 కోట్లతో ఆరు లేన్ల రహదారి నిర్మించారు. ఇప్పుడు దీనిని గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా తీర్చిదిద్దారు. జాతీయ రహదారి పొడువునా... రోడ్డుకు ఇరువైపులా 30 వేల మొక్కలు నాటారు. నిత్యం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. రోడ్డుకు మధ్యలో 14 వేలకు పైగా మొక్కలను నాటుతున్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఢిల్లీకి చెందిన మెగా ఇంజనీరింగ్ డీబీఎల్ సంస్థ శరవేగంగా మొక్కలనాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ రహదారిపై గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించడానికి అనుమతిస్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద తప్పితే మరెక్కడా ఆగకుండా గమ్యస్థానికి చేరుకునేలా రూపొందించారు. ప్రతి రెండు కిలోమీటర్లకు సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీని ద్వారా స్పీడ్ డిస్‌ప్లే, స్పీడ్ కంట్రోల్, ట్రాఫిక్ సిగ్నల్స్ తెలుసుకోవడం కూడా సులభంగా ఉంటుంది. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో, వంతెనల జంక్షన్లలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు తగ్గినట్లే...

చెన్నై–కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారి అనకాపల్లి మీదుగా గాజువాక, ఎన్‌ఏడీ, విశాఖ నగరంలో నుంచి విస్తరించి ఉంది. రాష్ట్రాల మధ్య రవాణా వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా విశాఖ నగరంలో నుంచి రాకపోకలు సాగించడంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారితో అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం వరకు జాతీయ రహదారిని కలపడంతో నగరానికి ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోనుంది. జాతీయ రహదారిపై విజయవాడ నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి వద్ద బైపాస్ నుంచి సబ్బవరం మీదుగా ఆనందపురం వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. దీంతో నగరానికి పూర్తిగా ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. ఒక విధంగా చూస్తే విశాఖ నగరానికి ఈ రహదారి బైపాస్‌గా మారనుంది. సబ్బవరం దగ్గర ఒక ఇంటర్ చేంజ్ సెక్షన్, పెందుర్తి దగ్గర మరోకటి ఏర్పాటు చేయడంతో విశాఖ నగరానికి వెళ్ళేందుకు మరిన్ని దారులు ఏర్పడ్డాయి.

స్థానికులకు నో టోల్‌ట్యాక్స్

ఈ రహదారి విస్తరణలో మొత్తం మూడు టోల్ ప్లాజాలను ఏర్పాటు చేయనున్నారు. క్లోజ్డ్ టోలింగ్ సిస్టమ్ ద్వారా అనకాపల్లి వద్ద మర్రిపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం ప్రాంతాలలో చేపట్టే టోల్‌ప్లాజాల వద్ద టోల్‌ఫీజు వసూలు నుంచి స్థానికులను మినహాయించారు. సర్వీసు రోడ్డును ఏ టోల్ ప్లాజాకు అనుసంధానం చేయడం లేదు. దీంతో స్థానికులు టోల్‌ప్లాజాకు వెళ్లాల్సిన పనిలేకుండా సులభతరం చేస్తున్నారు.

ఇవీ ప్రత్యేకతలు

ఆరు లేన్ల రహదారికి వెచ్చించిన మొత్తం	రూ.2,013 కోట్లు
రహదారి మొత్తం పొడవు	58.8 కిలోమీటర్లు
ఈ రహదారిని తాకే గ్రామాలు	35
ఇంటర్ చేంజ్ సెక్షన్లు	3
అండర్ బ్రిడ్జిలు	21
వంతెనలు	10
బాక్స్ కల్వర్టులు	52
పైప్ కల్వర్టులు	44
అప్రోచ్ రోడ్లు నిర్మించిన గ్రామాలు	25
బస్‌స్టేషన్లు	4
జంక్షన్లు	20



నిర్మాణం పూర్తయిన అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి



అనకాపల్లి బైపాస్ వద్ద ఇంటర్ చేంజ్ సెక్షన్, సోలార్ లైట్లు

మే నెలాఖరు నాటికి పూర్తిగా..



జాతీయ రహదారిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా తీర్చిదిద్దుతున్నాం. మే నెలాఖరు నాటికి వాహనాలను పూర్తిగా వదలనున్నాం. త్వరలో పోర్టు వాహనాలకు కూడా రోడ్డు నిర్మాణపనులు చేపడుతున్నాం. పినగాడి నుంచి షీలానగర్ వరకూ రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. ప్రమాదాలకు తావు లేకుండా ఆధునిక విధానంలో నిర్మాణం చేపట్టిన జాతీయరహదారి ఇది. వేగంగా వెళ్లినా సురక్షితంగా ప్రయాణించవచ్చు.

– ప్రమోద్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, డీబీఎల్ సంస్థ

నాడు వైఎస్సార్.. నేడు జగనన్న



లంకెలపాలెంలో నిర్మించిన యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి రజని, ఎంపీ సత్యవతి

- ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధికి చిరునామాగా మార్చారు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- లంకెలపాలెం, నమ్మిదొడ్డి ప్రాంతాల్లో యూపీహెచ్‌సీలు ప్రారంభం

అగనంపూడి: రాష్ట్రంలో ఆస్పత్రులు అభివృద్ధికి చిరునామాగా మారాయంటే ఆ ఘనత అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, నేడు పేదల పెన్నిధి జగనన్నకే చెందుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని అన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో సీఎం జగన్ తండ్రికి తగ్గ తనయుడన్నారు. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెంలో రూ.కోటి 23 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హెల్త్ సెంటర్‌లో నిరంతరం డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఓపీ సేవలు అందిస్తారని, 172 రకాల మందులు లభ్యమవుతాయని తెలిపారు. ప్రతీ ఆస్పత్రిని ఆధునీకరించడంతో పాటు స్థాయిని రెట్టింపు చేసుకుంటూ వెళ్తున్నామని చెప్పారు. వైద్యులు, సిబ్బంది ప్రతీ ఆస్పత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో రూ.399 కోట్ల వ్యయంతో యూపీహెచ్‌సీలను నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక చంద్రబాబు నాయుడు విషం చిమ్ముతున్నారన్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ లంకెలపాలెం వాసుల చిరకాల స్వప్నం నేటికి నెరవేరిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వైద్యసేవలను ప్రజలందరికీ అందుబాటులో తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని, జాతీయస్థాయిలో వైద్య రంగంలో అత్యుత్తమ సేవలకు గాను అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ, అనకాపల్లి వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, పరవాడ ఎంపీపీ పైలా వెంకట పద్మాలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ టెంపుల్ టూరిజం



- ప్రతి పౌర్ణమికి అరుణాచల యాత్ర
- కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తిల దర్శనం
- ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ.4,000
- వారాంతంలో పూరీ, భువనేశ్వర్‌లకు స్పెషల్స్
- సంవత్సరం పొడవునా నడపాలని నిర్ణయం
- ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్తమార్గాల అన్వేషణ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ప్రయాణికుల ద్వారా వచ్చే రాబడికంటే దానికయ్యే ఖర్చే అధికంగా ఉంటోంది. అయినప్పటికీ సేవా దృక్పథంతో ప్రజల కోసం బస్సులను నడుపుతోంది. దీంతో ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే లాజిస్టిక్స్ ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. కొత్తగా కార్గోలో డోర్ డెలివరీ, పికప్ సదుపాయాలను కూడా ప్రవేశపెట్టింది. దీనికి వినియోగదార్ల నుంచి ఆదరణ బాగుంటోంది. ఈ నేపథ్యంలో సరికొత్తగా టెంపుల్ టూరిజంపై ఫోకస్ పెట్టింది. ఇందులోభాగంగా విశాఖపట్నం నుంచి తమిళనాడులోని అరుణాచలం, పొరుగున ఒడిశాలో ఉన్న పూరీ సహా మరికొన్ని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అరుణాచలానికి 120 వరకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. ప్రతి పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ (ద్వారకా బస్‌స్టేషన్) నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మే 5 నాటి పౌర్ణమికి 3వ తేదీ నుంచే ఇక్కడ నుంచి ఈ బస్సులు బయలుదేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అరుణాచలం వెళ్లేటప్పుడే కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తి దేవాలయాలను కూడా దర్శించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పౌర్ణమి దర్శనం అయ్యాక ఏడో తేదీన విశాఖలో చేరుస్తామన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.4,000, ఇంద్ర ఏసీ సర్వీసుకు రూ.5,000 చొప్పున ఒక్కొక్కరికి టిక్కెట్టు ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే వీలు కల్పించామన్నారు.

పూరీ, భువనేశ్వర్‌లకు కూడా..

మరోవైపు పొరుగున ఒడిశాలోని కొన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా స్పెషల్ ప్యాకేజీతో బస్సులను నడపనున్నట్టు ఈడీ రవికుమార్ తెలిపారు. పూరీలోని జగన్నాథస్వామి, భువనేశ్వర్‌లోని లింగరాజస్వామి, కోణార్క్ సూర్య దేవాలయం, చిలక సరస్సుల సందర్శనకు ప్రతి వారాంతం (శనివారం)లో వీటిని నడుపుతామన్నారు. ఈనెల 29 నుంచి ఈ బస్సులను ప్రారంభిస్తామన్నారు. ఈ ప్యాకేజీలో (సూపర్ లగ్జరీ) టిక్కెట్టు ధర రూ.2,350గా నిర్ణయించామని చెప్పారు. డిమాండ్‌ను బట్టి ఏసీ సర్వీసులను కూడా ప్రవేశపెడతామన్నారు. అరుణాచలంతో పాటు ఒడిశా పుణ్యక్షేత్రాలకు ఏడాది పొడవునా ఈ టెంపుల్ టూరిజం బస్సులు నడుపుతామని తెలిపారు. మీడియా సమావేశంలో ఆర్టీసీ డీపీటీవో బలిజి అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, విశాఖ డిపో మేనేజర్ గంగాధరరావులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులపై పీడీ యాక్ట్

- గంజాయి రవాణాపై నిఘాకు ప్రత్యేక బృందాలు
- సాధారణ మరణాలపై సమగ్ర దర్యాప్తు
- వేసవిలో దొంగతనాలు జరగకుండా ప్రజలకు అవగాహన
- నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి : గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు పదే పదే పట్టుబడితే వారిపై సస్పెక్ట్ షీట్ తెరిచి, పీడీ యాక్టు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో నియంత్రించాలన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులతో పాటుగా మిస్సింగ్ కేసులు, సాధారణ మరణాలు, పోక్సో కేసులను ఎస్పీ సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులు, సాధారణ మరణాల కేసులపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచుతూ తగాదాలు, రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని తెలిపారు. తరుచూ రోడ్డు ప్రమాదాల జరిగే ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

వేసవిలో చోరీలపై అప్రమత్తం

వేసవి సెలవుల్లో ఊరెళ్లేవారు ముందస్తుగా ఎల్‌హెచ్ఎంఎస్‌లు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ మురళీకృష్ణ పోలీసు అధికారులకు సూచించారు. వేసవి కారణంగా రాత్రి సమయాలలో వేడిని తట్టుకోలేక చాలామంది ప్రజలు ఆరుబయట నిద్రించడం, ఇంటి తలుపులు తెరిచి ఆదమరిచి నిద్రించడం జరుగుతోందన్నారు. ఇదే అదునుగా ఇళ్లలో దొంగలు పడే ఆస్కారం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

అపరిచితులపై నిఘా..

రాత్రి, పగలు గస్తీలలో అనుమానాస్పదంగా ఉండే అపరిచితులపై నిఘా పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. వారి వివరాలను..నేర చరిత్ర ఉన్నవారుంటే వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదుదారుల సమస్యలకు ప్రాముఖ్యతనిచ్చి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, దత్తత గ్రామాల కానిస్టేబుల్స్, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల గ్రామాల నుంచి వచ్చే సమాచారంపై అధికారులు త్వరితగతిన స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైం) పి.సత్యనారాయణ రావు, డీఎస్పీలు మళ్ల మహేశ్వర రావు, పరవాడ పి.శ్రీనివాసరావు, కె.ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రూ.7.5 కోట్లతో తాచేరు వంతెన నిర్మాణం



డి.గొటివాడ పాఠశాలలో నాడు నేడు పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

- మాడుగుల వరకు రోడ్డు కూడా..
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: డి.గొటివాడ గ్రామం నుంచి తాచేరు నదిపై వంతెన నిర్మాణంతోపాటు మాడుగుల వరకు రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) నిధులు రూ.7 కోట్ల 50 లక్షలు మంజూరైనట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చెప్పారు. ఒంటి కొంప శ్రీరాంపురం, దోర్ల గొటివాడ, సమీపంలో ఉన్న సీరావారి కళ్లాల్లో మంగళవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'నాడు–నేడు'లో రూ.16 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభించారు. తాచేరు వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతీయుల కష్టాలు తీరిపోతాయన్నారు.

క్లుప్తంగా

శనివారమూ అందుబాటులో పాస్‌పోర్టు సేవలు

మురళీనగర్(విశాఖ ఉత్తర): ప్రస్తుతం పాస్‌పోర్టులకు ఉన్న భారీ డిమాండ్ దృష్ట్యా పాస్‌పోర్టు కార్యాలయాలు కొంత కాలం శనివారం కూడా సేవలు అందిస్తాయని విశాఖపట్నం, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రతి శనివారం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, భీమవరంలోని పాస్‌పోర్టు జారీ కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి శనివారం 2200 స్లాట్లను రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెల 26 ఉదయం నుంచి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కొత్త దరఖాస్తుదారులతో పాటు, రీషెడ్యూల్ కేటగిరీలో పాస్‌పోర్టులు కావాల్సిన వారు, అపాయింట్‌మెంట్ తేదీలను మార్చుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. సాధారణ పనిదినాల్లో(సోమవారం నుంచి శుక్రవారం వరకు) కూడా అదనపు స్లాట్లను ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి రోజు అదనంగా 50 స్లాట్‌లను రిలీజ్ చేయనున్నామన్నారు. తత్కాల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన డాక్యుమెంట్లను పాస్‌పోర్టు సేవా ప్రాజెక్టు పోర్టల్‌లో సమర్పించి రీషెడ్యూల్‌ను నివారించవచ్చన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వేతనాల మంజూరు

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు వేతనాలతో పాటు, పారితోషకాలకు సైతం నిధులు మంజూరు చేస్తూ ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ స్టాఫ్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారికి సైతం వేతనాలు చెల్లించేలా నిధులు కేటాయించారు. విశాఖపట్నం జిల్లాకు రూ.2.42 కోట్లు, అనకాపల్లికి రూ.6.39 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.5.02 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించి, నివేదికలు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీడీపీ హయాంలో విద్యా సంవత్సరం ముగిసినా వేతనాలు మంజూరు కాని పరిస్థితి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరం ఈ నెలతో ముగిస్తుండగా, ముందుగానే వేతనాలకు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

అంబరాన్నంటిన గౌరీపరమేశ్వరుల సంబరం


కోదండరాముడి వేషధారణ


సత్యనారాయణ వ్రతం


దుర్గాదేవి వేషధారణ

- ఆకట్టుకున్న దేవతా మూర్తుల వేషధారులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బుచ్చెయ్యపేట : మండలంలోని బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల సంబరం అంబరాన్నంటింది. సంబరంలో ఏర్పాటు చేసిన బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. బళ్లపై వివిధ దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు అలరించారు. ఇటీవలి కాలంలో ఎక్కడ పండగలు, జాతరలు నిర్వహించినా, డాన్స్ బేబీ డాన్స్‌లే ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల ఊరేగింపులో 12 స్టేజీలను ఏర్పాటు చేసి, ఒక్కో స్టేజీపై ఒక్కో అంశానికి సంబంధించిన దేవతామూర్తుల వేషధారులు కొలువుదీరారు. ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ యుగంలో కూడా అలనాటి సంస్కృతీ, సంప్రదాయాలను కళ్లముందుంచారు. బళ్ల వేషాల్లో గెలుపొందిన వారికి సంబరాల సందర్భంగా బహుమతులు అందించారు. భక్త మార్కండేయ స్టేజీకి ప్రథమ బహుమతిగా పావు తులం బంగారం, సత్యనారాయణమూర్తి వేషధారణకు ద్వితీయ బహుమతిగా 10 తులాల వెండి, కృష్ణార్జున రథం స్టేజీకి తృతీయ బహుమతిగా 5 తులాల వెండిని రెండు గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందించారు. ఈ వేడుకల్ని చూసేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

వైఎస్సార్‌సీపీలో స్వచ్ఛంద సేవకుడు సత్తిబాబు


సత్తిబాబుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : మండలంలోని సాగరం గ్రామ పెద్ద, ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు గొర్లి సత్తిబాబు మంగళవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు, డిప్యూటీ సీఎం ఎంత స్థాయికి ఎదిగినా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలకు అందిస్తున్న సేవలు చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్టు సత్తిబాబు తెలిపారు. సత్తిబాబుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాదు సూర్యకాంతం, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనాదు జగ్గారావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, పాము వెంకటరావు, యన్నంశెట్టి వెంకట రమణ, పొలిమేర చిన్నారావు, కాళింగ కళ్యాణరాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికార వాటర్ ప్లాంట్ సీజ్


శ్రీగణనాథ్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసిన అధికారులు

రావికమతం : చినపాచిల గ్రామంలో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న శ్రీగణనాథ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను డివిజనల్ ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్ మంగళవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఎంఎం నాగ్ ఐఎస్ఐ మార్క్ లైసెన్స్ పొందకుండానే వాటర్ ప్యాకెట్లతో పాటు, బాటిళ్లు తయారుచేసి విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ మహేశ్వరరావుతో కలిసి దాడి చేశామన్నారు. వాటర్ ప్లాంట్‌కు ఐఎస్ఐ మార్క్ లేదని స్పష్టం చేశారు. నీటి నాణ్యతను పరిశీలించే ల్యాబ్ కూడా లేకుండా వ్యాపారం చేయడాన్ని గుర్తించి సీజ్ చేసినట్టు వెల్లడించారు. ప్లాంట్‌లో నిల్వ ఉన్న 300 వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లను గుర్తించామన్నారు. ఇప్పటి వరకూ అనకాపల్లి జిల్లాలో ఎలాంటి అనుమతులు లేని 13 వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ దాడుల్లో స్థానిక వీఆర్వో మురళి కూడా ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం


రామన్నపాలెంలో విచారణ చేస్తున్న డీటీ ఈశ్వరరావు

మాకవరపాలెం : రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం తాకట్టు పెట్టారంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవమని పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు మంగళవారం స్పష్టం చేశారు. మండలంలోని రాచపల్లి సచివాలయం పరిధి రామన్నపాలెం, రాచపల్లి, ధర్మవరం, కొత్తపాలెంలో రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం రామన్నపాలెంలో ఉంది. దీంతో డ్రైవర్ వాహనాన్ని తాకట్టు పెట్టినట్టు సోమవారం ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మంగళవారం డీటీ ఈశ్వరరావు రామన్నపాలెంలో విచారణ చేపట్టారు. ప్రతి నెలా తొలుత రామన్నపాలెం నుంచే బియ్యం పంపిణీ ప్రారంభిస్తారన్నారు. ఈ నేపథ్యంలో రామన్నపాలెంలో వాహనాన్ని ఉంచినట్టు తెలిపారు. స్థానికులను కూడా విచారణ చేశామని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నెలనెలా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారన్నారు. డ్రైవర్ నాగరాజు ఇక్కడే ఉన్నాడని, వాహనాన్ని తాకట్టు పెట్టిన మాట అవాస్తవమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజారావు, వీఆర్వో సింహాద్రి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు విద్యార్థి బలి

అనకాపల్లిటౌన్ : క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయిన విద్యార్థి పి.మధు ఆత్మహత్యకు పాల్పడగా విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ అంజిబాబు చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. మండలంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన పి.మధు క్రికెట్ బెట్టింగ్‌లో నష్టం వచ్చిందని ఆవేదన చెందుతూ ఈనెల 23వ తేదీన గ్రామ సమీపంలో పొలాల్లో గులుకులు సేవించాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు విశాఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అక్రమ నిర్మాణాలు కనిపించట్లేదా?

- కమిషనర్‌పై ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆగ్రహం

యలమంచిలి : 'పట్టణంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. విధుల్లో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. ఇంత అడ్డగోలుగా నిర్మాణాలు జరుగుతుంటే మీ కంటికి కనిపించట్లేదా?' అంటూ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణిపై యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో నాగేంద్ర కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఓ చోట నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని చూసి ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ భవనం వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల్లో రెండో అంతస్తు నుంచి అప్పికొండ రాంబాబు అనే తాపీమేస్త్రి సోమవారం రాత్రి జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటనను ప్రస్తావిస్తూ కమిషనర్‌ను, ఇతర అధికారుల్ని ఎమ్మెల్యే మందలించారు. నిర్మాణాలపై పర్యవేక్షణ చేయకుండా మీరేం చేస్తున్నారని కమిషనర్‌ను నిలదీశారు. లంచాలకు తలొగ్గి, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తాను లంచాలు తీసుకోవట్లేదని ఎమ్మెల్యేకు కమిషనర్ బదులివ్వడంతో, చెత్త బుట్టల పేరుతో ఎంత తిన్నారో తెలుసని ఎమ్మెల్యే అనడంతో కమిషనర్ నీళ్లు నమిలాల్సి వచ్చింది. రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా ప్రజలకు సరైన సేవలందించక, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రైతు బాగుంటేనే అభివృద్ధి


వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న పాడి రైతులు


పాడి రైతులు పెంచుతున్న కొత్త రకం ఆవులను పరిశీలిస్తున్న ఆనంద్

- రైతులకు బోర్లు, షెడ్లకు రూ.5 లక్షలు
- విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

బుచ్చెయ్యపేట : రైతులు బాగుంటేనే అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధిస్తామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. అత్యధిక పాలు ఉత్పత్తి చేస్తున్న బుచ్చెయ్యపేట మండలం కొత్త కొండెంపూడి, పాత కొండెంపూడి గ్రామాల్లో మంగళవారం ఆయన డెయిరీ డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి పర్యటించారు. రైతుల కళ్లాల వద్దకు వెళ్లి రైతులు పెంచుతున్న కొత్త రకం ఆవులను, వారి షెడ్లను పరిశీలించారు. రెండు గ్రామాల్లో రోజుకు 60 నుంచి వంద లీటర్ల పాలు పోస్తున్న పాడి రైతులతో మాట్లాడారు. వారు కొత్త రకం ఆవులను ఎక్కడ కొనుగోలు చేసిందీ, ఆవుల సంరక్షణ, విశాఖ డెయిరీ అందిస్తున్న ప్రోత్సాహకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడి రైతుల కోరిక మేరకు రెండు గ్రామాల్లో 20 మంచి నీటి బోర్లు, 20 గేదెల షెడ్లతో పాటు, ఆలయాల నిర్మాణాలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. విశాఖ డెయిరీ పాడి రైతులందరిదని, ప్రైవేట్ డెయిరీల మోసాలకు బలికాకుండా విశాఖ డెయిరీకి పాలు పోసి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్, పాల సంఘం అధ్యక్షులు, ముఖ్య నాయకులు దాడి సూరి నాగేశ్వరరావు, ఆది సత్తిబాబు, దొండా శ్రీను, రాజు, సుంకరి శ్రీను, వేపాడ మధు, బాబ్జి, సూర్యనారాయణ, మేనేజర్లు సత్యనారాయణ, సూపర్‌వైజర్లు నల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవం లోపాలపై జేసీ విచారణ

- నాలుగు రోజుల్లో నివేదిక


టికెట్ల జారీకి సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథం

సింహాచలం : ఈనెల 23న జరిగిన చందనోత్సవం నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యాలపై జాయింట్ కలెక్టర్ విశ్వనాథం మంగళవారం సాయంత్రం దేవస్థానం ఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. చందనోత్సవంలో వైఫల్యాలపై విచారణ చేయాల్సిందిగా జేసీ విశ్వనాథ్‌కు కలెక్టర్ సూచించారు. మంగళవారం సాయంత్రం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలోను, ఈవో చాంబర్‌లోని ఆయన పలు అంశాలపై విచారణ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చందనోత్సవంలో ఎక్కెడెక్కడ లోపాలు జరిగాయో విచారణ చేస్తున్నామన్నారు. టికెట్లు, వెహికల్ పాస్‌లు జారీ, మంచినీరు కేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటులో ఎక్కెడెక్కడ వైఫల్యాలు జరిగాయో ప్రాథమికంగా విచారణ జరిపామన్నారు. చందనోత్సవానికి సంబంధించి దేవస్థానం అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్, ఎన్ని టికెట్లు జారీ చేశారు, ఎన్ని టికెట్లు ఇష్యూ చేయలేదో, ఎన్ని బ్లాంక్స్ ఉన్నాయో తదితర అంశాలపై విచారణ జరిపామన్నారు. సీసీ టీవీ చెక్ చేసి పలువురుని విచారించాల్సి ఉందన్నారు. నాలుగు రోజుల్లో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్ కుమార్, రమణమూర్తి, సూపరింటెండెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను విచారించారు. దేవస్థానం ఎస్‌డీసీ రామలక్ష్మి, చినగదిలి తాహసీల్దార్ రమణయ్య, జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి భాషా, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో జామిరాము పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల గౌరవాధ్యక్షుడు మృతి


గాలి సత్యనారాయణ (ఫైల్)

దేవరాపల్లి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవరాపల్లికి చెందిన గాలి సత్యనారాయణ(65) మంగళవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, సతీమణి బూడి రమణమ్మ దేవరాపల్లిలోని సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కెళ్ల నాయుడుబాబు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, మండల మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు నివాళులర్పించారు. అనంతరం దేవరాపల్లిలో సత్యనారాయణ మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

కేజీహెచ్‌లో రోగులు, సహాయకులకు

అధిక ప్రాధాన్యం


సత్రం ఆవరణలో శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఇస్కాన్ ప్రతినిధులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- రూ.50 లక్షలతో ఆధునికీకరించిన 200 పడకల సత్రం ప్రారంభం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు అధిక ప్రాధాన్యమిస్తూ మెరుగైన వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని తెలిపారు. కేజీహెచ్‌లో రూ.50 లక్షల నిధులతో ఆధునికీకరించిన 200 పడకల సత్రాన్ని మంత్రి విడదల రజిని మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఇందులోని వసతి గదులు, బెడ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ సీఎస్ఆర్ ఫండ్ నుంచి రూ.30 లక్షలు, ఇస్కాన్ సంస్థ అందించిన మరో రూ.20 లక్షలతో భవనాన్ని ఆధునికీకరించామన్నారు. ఈ సత్రంలో 8 బ్లాకుల్లో ఒక్కొక్క బ్లాక్‌లో 25 బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. సత్రం నిర్వహణ బాధ్యతలు ఇస్కాన్ సంస్థ చేపడుతుందన్నారు. ఒక్కొక్క బెడ్ నుంచి రూ.50 సాధారణ రుసుం వసూలు చేసి మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తారని మంత్రి వివరించారు. అధునాతన వైద్య పరికరాల కోసం రూ.2.66 కోట్లు, 10 అంబులెన్స్‌ల కోసం రూ 2.5 కోట్లు ఇవ్వడానికి హెచ్‌పీసీఎల్ సంస్థ కేజీహెచ్‌తో ఒప్పందం చేసుకుందని ఆమె తెలిపారు.

అంతకు ముందు మంత్రి రజిని సత్రం ఆవరణలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నాడు–నేడు కింద సత్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, ఏపీ ఎంఐడీసీ, ఈఈడీఏ నాయుడు, డీఈ మన్మథరావు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దళమంతుల మాణిక్యాలరావు, దళమంతుల చిన్న, సూరిన రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరుడే ఆదర్శం


మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి, చిత్రంలో స్వాత్మానందేంద్ర సరస్వతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- శారదాపీఠంలో ఘనంగా శంకర జయంతి వేడుకలు
- సీతా ఆధ్వర్యంలో ఆలయ సంస్కృతిపై సదస్సు


స్వామీజీల ఆశీస్సులు తీసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం : యావత్ విశ్వమంతటికీ ఆదిశంకరాచార్యులు మాత్రమే జగద్గురువులవుతారని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి స్పష్టం చేశారు. భారతావనిలో ఆదిశంకరులు అవతరించకపోతే సనాతన హిందూ ధర్మానికి విఘాతం ఏర్పడేదన్నారు. అవైదిక మతాలు, ఛాందస మతాలు, శూన్య మతాలు విస్తరిస్తూ నాస్తిక వాదనలు పెరుగుతున్న సమయంలో ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత, వేదాంత ప్రచారం ద్వారా సనాతన ధర్మాన్ని శరకరాచార్య నిలబెట్టారని గుర్తుచేశారు. శంకర జయంతి వేడుకలను మంగళవారం విశాఖ శ్రీ శారదాపీఠంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతితో కలిసి ఆదిశంకరుల ప్రతిమకు స్వరూపానందేంద్ర సరస్వతి విశేష అభిషేకం నిర్వహించారు. మహా మంగళ హారతులిచ్చారు. పీఠం ప్రాంగణంలో పండితులు ఉపనిషత్తులను పారాయణ చేశారు. ఈసందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడారు. విగ్రహారాధనకు అతీతంగా పరమాత్మ స్వరూపాన్ని పరిశోధనాత్మక ధోరణిలో తెలియజేసిన ఏకైక గురువు జగద్గురు ఆదిశంకరాచార్యులే అని తెలిపారు. గొప్ప గురు సంప్రదాయం విశాఖ శ్రీ శారదరాపీఠం సొంతమని, తమ పరమ గురువులు సచ్చిదానంద, అద్వైతానందలను ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు.

విశేషంగా వేదసభ : వేడుకల్లో భాగంగా శంకరులను స్మరిస్తూ విశిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణాన్ని విశేషంగా నిర్వహించారు. వందలాదిమంది మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. శంకాచార్యుల వారిని స్మరిస్తూ వేద సభను నిర్వహించారు. వేద పండితులకు ఈసందర్భంగా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి దక్షిణ అందజేశారు. చతుర్వేదాలకు చెందిన పండితులు ఈసభలో పాల్గొన్నారు. అనంతరం శంకర స్వరజరి పేరుతో సాంస్కృతిక ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో శారదా సుబ్రహ్మణ్యయన్ బృందం శంకరాచార్య విరచిత గేయాలను ఆలపించారు.

సీతా ఆధ్వర్యంలో ఆలయ సంస్కృతిపై సదస్సు

వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ దేవాలయ పరిపాలనా సంస్థ (సీతా) ఆలయాల కార్యనిర్వహణాధికారులకు సదస్సు ఏర్పాటు చేసింది. భారతీయ సనాతన సంప్రదాయం–ఆలయ సంస్కృతి పేరుతో జరిగిన సదస్సులో పలు దేవస్థానాలకు చెందిన ఈవోలు పాల్గొన్నారు. హిందూ ధర్మంలో ఆలయాల ప్రాధాన్యతను వివరిస్తూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎస్.కృష్ణమూర్తి ప్రసంగించారు. ఆలయాల పరిరక్షణతోనే హిందూ ధర్మం పరిడవిల్లుతుందని అన్నారు. ఆలయాల నిర్వహణను అధికారులు గురుతర బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఈసదస్సులో కలెక్టర్ మల్లికార్జున, ఏయూ మాజీ వీసీ ప్రసన్నకుమార్, దేవదాయశాఖ సంయుక్త కమిషనర్ ఆజాద్, ఆర్జేసీ సురేష్‌బాబు, డీసీ విజయర్‌రాజ్, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణ్‌శర్మ, సీతా డైరెక్టర్ రామచంద్రా, అర్చక అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కుంచంగి గ్రామంలో గడప గడపకు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో కుంచంగి గ్రామంలో ఈనెల 26న ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయుచున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా రామానుజుల జయంతి



రామానుజుల విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో శ్రీరామానుజుల జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు రామానుజుల చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతతో ఉపాధి కల్పించాలి

తుమ్మపాల: అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు సకాలంలో చెల్లించి, ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయుసి, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా యూనిట్ చైర్మన్ సింగంపల్లి వాసు, ఏపీ ఈఆర్ఎస్ఏ అధ్యక్షుడు రత్నం కేజీబీవీ రాష్ట్ర అధ్యక్షురాలు దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన వేతనం అమలు చేయాలన్నారు. వారి సీనియారిటీ, అర్హతను బట్టి సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ వి.వి.శ్రీనివాసరావు, దేవి వరప్రసాద్, కె.అప్పారావు, ఏఐటీయుసీ జిల్లా ఇంచార్జి కోన లక్ష్మణ, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.సాంబశివరావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 989 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	3,990	4,160
రెండో రకం	3,570	3,980
మూడో రకం	3,300	3,520

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్ 42 యూనిట్లు, ఏబి పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 457 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 421 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

సంక్షేమ పాలనకు నీరాజనం



తాళ్లపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : స్వాతంత్య్రం సిద్ధించాక ఇంతపెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు అందించిన ప్రభుత్వాన్ని నేనెప్పుడూ చూడలేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో కొప్పాక గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి స్ఫూర్తిదాయకంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచిందని పేర్కొన్నారు. అర్హతే కొలమానంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నేరుగా పథకాలు అందించిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమాన్ని పక్కాగా అమలు చేసినందుకే ప్రజాప్రతినిధులు ధైర్యంగా గడప గడపకు రాగలుగుతున్నామని ఆయన చెప్పారు. గ్రామంలో ఎస్సీకాలనీలో ఇంటింటికీ కుళాయిలు కావాలని స్థానికులు అభ్యర్థించడంతో మంత్రి అమర్‌నాథ్ స్పందించి పది, పదిహేనురోజుల వ్యవధిలో కుళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వీవీఆర్‌నగర్‌లో పైపు లైన్ డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు మంత్రిని అభ్యర్థించారు. డ్రైనేజీ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

కశింకోట : మండలంలోని రెండో మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంగళవారం రాత్రితో విజయవంతంగా పూర్తి చేశారు. పది రోజులపాటు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పర్యటించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి, సచివాలయ కన్వీనర్ లగిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో తాళ్లపాలెం, శివారు బంగారయ్యపేట గ్రామాల్లో సుమారు 1200 ఇళ్లను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేశారు. చివరి రోజు నూకాంబిక ఆలయం, తాళ్లపాలెం కూడలిలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడం పట్ల ఎంపీటీసీ సభ్యురాలు భవాని, సచివాలయ కన్వీనర్లు గణేష్, గుమ్మడి నారాయణరావు, ముసిలి నాయుడు, జనార్దన్, కరణం శ్రీను, ఇల్లపు శ్రీను, గృహ సారథులు, పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

స్టోన్ క్రషర్ నిర్వహణకు అభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న గ్రామస్తుడు

అనకాపల్లిటౌన్: పాపయ్యసంతపాలెం గ్రామంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో లోక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ మాట్లాడుతూ పాపయ్యసంతపాలెం గ్రామం, సర్వే నంబర్.176లో 21.692 హెక్టార్లల్లో కలర్ గ్రానైట్‌కు 5,400 క్యూబిక్ మీటర్లు, రోడ్డుమెటల్, బిల్డింగ్ స్టోన్స్, 4,91,400 క్యూబిక్ మీటర్లు, గ్రావెల్ 48,600 క్యూబిక్ మీటర్లు, సంవత్సరానికి తవ్వకం చేపట్టడానికి గ్రామ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టినట్టు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, రహదారికి ఇరువైపులా మొక్కలను నాటి, దుమ్ముధూళి రాకుండా పరిశుభ్రంగా ఉంచాలని, నెలకు ఒకసారి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, క్వారీలో గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ కాలుష్య నియంత్రణశాఖ అధికారి సుదర్శన్‌రావు, జిల్లా మైనింగ్ అధికారి రవివర్మ, తహసీల్దార్ గంగాధరరావు, లోక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఆశోక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



కశింకోటలో నిర్వహిస్తున్న ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ చేశారు. మలేరియా అంతం-మనందరి పంతం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ దోమలు నీరు నిల్వ ఉండేచోట గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయన్నారు. ఇవి ఎదగకుండా నీరు ఉండే పాత్రలను ఖాళీ చేసి ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, ఇంట్లో పొగ పెట్టడం ద్వారా దోమలను బయటకు తరిమి వేయొచ్చన్నారు. జ్వరం వచ్చిన వారు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు సత్యనారాయణ, సత్యవతి, మురళీకృష్ణ, సూపర్‌వైజర్లు రామ్మూర్తి, మున్ని, విజయలక్ష్మి, పారా మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



జి.భీమవరంలో రక్షిత మంచినీటి పథకానికి కొత్త మోటారు అమర్చుతున్న పంచాయతీ సిబ్బంది

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి కొత్త మోటారు అమర్చి మంగళవారం నీటి సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజుల క్రితం గ్రామంలోని సచివాలయం వద్ద ఉన్న 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం మోటారు కాలిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టే అవకాశం లేకపోవడంతో రూ.36 వేలతో కొత్త మోటారును కొనుగోలు చేసి, తాజాగా అమర్చారు.

మరో రెండు పథకాల ద్వారా గ్రామం, కాలనీల అంతటికీ సమృద్ధిగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ హనుమంత వెంకటలక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, పంచాయతీ కార్యదర్శి భర్నికాన చిన్నోడు తెలిపారు.

సత్వర న్యాయం అందించాలి



న్యాయమూర్తులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్: న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్ అన్నారు. స్థానిక న్యాయసముదాయంలో బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు గంగరాజు, ప్రదీపాల వీడ్కోలు సభలో మంగళవారం ఆయన మాట్లాడారు. న్యాయవృత్తిలో వ్యవహరించాల్సిన అంశాలను ప్రస్తావించారు. అంతకుముందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి దివాకర్‌లు న్యాయమూర్తులు జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి అమరరంగేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయచందర్, నిరుపమాభంజ్‌లను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైఖేల్, కోశాధికారి సందీప్, లైబ్రేరియన్ జగపతి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సాయిరాం, న్యాయవాదులు రమణయ్య, సీనియర్ న్యాయవాదులు జయరాం, వద్దాది వెంకటరావు, బి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



స్వామివారి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఆయన స్వగృహంలో మంగళవారం వీరబ్రహ్మేంద్ర స్వామి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామంలో స్వామి వారి నూతన ఆలయ ప్రారంభించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి కేంద్రం తూట్లు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు

కశింకోట : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. సీపీఐ ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా కశింకోటలో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశమై మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.272 కూలి చెల్లిస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. తక్షణమే కూలి రోజుకి రూ.600 పెంచి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎం. సత్తిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు నేడు

కశింకోట : కశింకోట పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుందని, దీన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభిస్తారని సర్పంచ్ మంత్రి జయరజని తెలిపారు. కార్యక్రమానికి కంటి సమస్యలున్న రోగులు హాజరై చికిత్స పొందాలని సూచించారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు సత్కారం



జ్యోత్స్నను శాలువతో సత్కరిస్తున్న ఉగ్గిన అప్పారావు

అనకాపల్లిటౌన్: స్థానిక శ్రీరామదేవ వ్యాయామ సంఘం క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖ ఏయూలో జరిగిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మంగళవారం పోటీల్లో 52 కేజీల విభాగంలో ఎ.జ్యోత్స్నకు ప్రథమ బహుమతితో పాటు, స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ సాధించినందుకు జిమ్ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు శాలువతో జ్యోత్స్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిమ్ వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిమ్ కార్యదర్శి లక్కరాజు రమేష్, కోశాధికారి వెదుళ్ల వెంకట నూకేశ్వరరావు, ఉపాధ్యక్షులు పెదిరెడ్ల రమేష్ పాత్రుడు, వాకాడ సతీష్, సహాయ కార్యదర్శులు ఉగ్గిన శివ, సోమిశెట్టి భార్గవ్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

అనకాపల్లిటౌన్: పట్టణ ప్రజలు పారిశుధ్యానికి సహకరించినట్లయితే దోమల నిర్మూలనతోపాటు వివిధ రకాల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జెడ్సీ పి.వెంకటరమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కాలువల్లో చెత్తను వేయడం వల్లనే దోమలు స్వైరవిహారం చేస్తాయని, దీంతో పాటు డెంగీ, మలేరియా వ్యాధులు సోకే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో 83వవార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, జోనల్ సిబ్బంది ఎస్ఎస్.రవికుమార్, గణేష్, అప్పారావు, శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మస్ట్ ఫిన్‌టెక్‌తో డైట్ కళాశాల ఒప్పందం



ఒప్పందం పత్రాలను చూపుతున్న చాజూహన్, ప్రిన్సిపాల్ నర్సింహం

అనకాపల్లిటౌన్ : విద్యార్థులకు కంప్యూటర్ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు సౌత్ కొరియాకు చెందిన 'మస్ట్ ఫిన్‌టెక్' డైట్ కళాశాలకు అంగీకారం కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహారావు అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టెక్నాలజీ సీఈవో చాజూహాన్‌తో కళాశాల ఒప్పందం ఏర్పడిందని చెప్పారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

- తుమ్మపాలలో అవగాహన ర్యాలీ

అనకాపల్లి రూరల్ : మలేరియా జ్వరం అత్యంత ప్రమాదకరమైనదని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.వాణీ జగదీశ్వరి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం తుమ్మపాల పీహెచ్‌సీ వద్ద జరిగిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియాపై నిర్లక్ష్యం వహించకూడదని ప్రజలను కోరారు. ఒకప్పుడు ఎంతో ప్రమాదకరంగా ఉండే ఈ మలేరియా జ్వరం ప్రభుత్వ చర్యల వల్ల ప్రస్తుతం అదుపులో ఉందన్నారు. పోలియో, మశూచి తరహాలోనే మలేరియాను కూడా నిర్మూలించే దిశకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేరుకోగలిగారని ఆమె పేర్కొన్నారు. ప్లకార్డులతో ర్యాలీ తర్వాత వైద్య సిబ్బంది మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.శారద, ఎంపీహెచ్‌ఈవో జె.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ బి.సంగం, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) ఎం. మాణిక్యాంబ, ఎంపీహెచ్ఏ ఎస్.రాము, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు ఆరోపించారు. సీపీఎం తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కశింకోటలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా సవరించిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. సమావేశంలో కార్మిక ప్రతినిధులు బి.నూకరాజు, వి.బెన్నయ్య పాల్గొన్నారు.

రెండురోజులపాటు ఆధార్ స్పెషల్ డ్రైవ్

అనకాపల్లిటౌన్ : జోనల్ పరిధిలో ఈనెల 26, 27 తేదీల్లో ఆధార్ మార్పులు, చేర్పులకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు జెడ్సీ పి.వెంకటరమణ మంగళవారం పేర్కొన్నారు. కొత్త ఆధార్‌కార్డు, పేరు, పుట్టిన తేదీ, చిరునామా, వేలిముద్రలు పడని వారు తగిన ఆధారాలతో ఆధార్ సచివాలయాల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వేల్పులవీధి-2, మిరియాలకాలనీ, దిబ్బవీధి, కొప్పాక సచివాలయాల్లో మాత్రమే ఈ సేవలందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్లబండి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ

కోటవురట్ల : మండలంలో లింగాపురం గ్రామంలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకొని సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కె.రమణ, రుత్తల గోవింద పాల్గొన్నారు.

విజేతలు వీరే...

నరసయ్యపేటకు చెందిన జనపరెడ్డి మోక్షిత్ ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా రూ.12వేలు అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన లక్ష్మీపురానికి చెందిన మహాదేవ్ శ్యాంకుమార్‌కు రూ.10వేలు, తృతీయస్థానం వరసిద్ధి వినాయక రూ.8వేలు, నాలుగో బహుమతి గెలుచుకున్న ఎల్‌బీపట్నంకు చెందిన బండారు హేమతేజకు రూ.6వేలు, ఐదారు స్థానాల్లో కొయిలాడ మనోజ్‌కు రూ.4వేలు, 6వ బహుమతి రూ.3వేలు చొప్పున విజేతలకు మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ అందజేశారు.

బాధ్యతగా పనిచేయండి

- విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- వైద్యులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో ఎమ్మెల్యే కన్నబాబురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : అవినీతికి తావు లేకుండా వైద్య సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. మంగళవారం యలమంచిలిలో యలమంచిలి మున్సిపాలిటీ, యలమంచిలి మండలంలోని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్‌లు, యలమంచిలి ప్రభుత్వాసుపత్రి వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో యలమంచిలి ప్రభుత్వాసుపత్రిపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వచ్చేవని, ప్రస్తుతం డాక్టర్ల మెరుగైన పనితీరు వల్ల సి గ్రేడ్‌లో ఉన్న ఆస్పత్రి బి గ్రేడ్‌కు వచ్చిందని అన్నారు. ఇక్కడ ప్రభుత్వాసుపత్రిలో గతంలో కంటే ప్రస్తుతం 10 మందికి పైగా వైద్యులు సేవలందిస్తున్నారని తెలిపారు. యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది, కాని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆశావర్కర్లు, ఏఎస్ఎమ్‌లు వివిధ ఉద్యోగులు కాని ఏ ఒక్క పేషెంట్‌నైనా ఒక్క రూపాయి లంచం అడిగినట్టు తన దృష్టికి వస్తే మరుక్షణం వారిని విధులు నుంచి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రోగులకు, వారి బంధువులకు తెలిసే విధంగా ఆసుపత్రిలో ఎవరైనా లంచం అడిగితే తక్షణమే తన నెంబరుకు కాల్ చేసే విధంగా ఆస్పత్రి ఆవరణలో తన ఫోన్ నెంబరు ముద్రించిన ఫ్లెక్స్ బోర్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఏ గ్రేడ్‌కు వచ్చే విధంగా సేవలందించి ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యా విధానంలో లలిత కళలు భాగం కావాలి



శ్రీ ప్రకాష్ విద్యార్థులతో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, న్యూఢిల్లీ ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై

పాయకరావుపేట : విద్యా విధానంలో లలిత కళలను ఒక భాగంగా చేసినప్పుడే విద్యార్థులకు భారతీయ సంస్కృతి, మన కళలు, ఆచారాలపై పూర్తి అవగాహన కలుగుతుందని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై అన్నారు. శ్రీ ప్రకాష్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు ఇతర దేశాలకు నేడు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ, ప్రఖ్యాత నటి జిల్ మిల్ హజారికా మాట్లాడుతూ విద్యతో పాటు నాట్యం, అభినయం తదితర రంగాల్లో యువత ఆసక్తి చూపాలని, తద్వారా మన సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించగలమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఇన్నోవేటివ్ థియేటర్ డైరెక్టర్ డాక్టర్ తూము శివప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, డైరెక్టర్ హెచ్‌ఆర్ డాక్టర్ బంగ్రారాజు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.